బాగున్నారా?" అన్నాడు విశ్వనాథం.

"ఆఁ!" అన్నాడు రామబ్రహ్మం.

"ఇంటర్ వెల్ యేగా. కాస్త ఆలారండి. టీ త్రాగి వద్దాం" అంటూ విశ్వనాథం "ఎందుకు లెండి" అని అంటూన్న రామబ్రహ్మన్ని టీ స్టాల్ దగ్గరకు తీసుకెళ్ళాడు.

ఇద్దరూ టీ త్రాగారు. డబ్బులు విశ్వనాథమే యిచ్చాడు. "ఇదిగో చూడండీ రామబ్రహ్మంగారూ! ఆవేళ హోటలులో తీసుకెళ్ళిన పది రూపాయల బాకీ యింత వరకు చెల్లించనే లేదు" అన్నాడు విశ్వనాథం.

"నిజమాలోచిస్తే మీకు నేను బాకీ ఇవ్వాల్సి లేననుకుంటాను. ఎట్లాగంటారా? మొదట నేను మీకు పరిచయపూర్వకంగా పది రూపాయలు ఇచ్చాను. జ్ఞాపకం తెచ్చుకోండి! తరువాత ఆ డబ్బు నేను మీవద్దనుండి తీసుకున్నా. ఇందులో మీకు నేను చెల్లించవలసిన బాకీలేదే" అన్నాడు రామబ్రహ్మం.

---

క థా ని క

# శిక్షవేసిన బిచ్చగాడు

"శివశ్రీ"

బిచ్చగాని గొంతుక నుండి బయల్వెడలిన శ్రావ్యసంగీతం అప్పుడే పెట్టెలోకి తోసుకు తోసుకు ఎక్కిన మనుష్యులకు కొంత హాయిని కల్పించింది. పెట్టె నిండా ఎక్కడి కక్కడ జనం నిలబడి ఉండటం వలన బిచ్చగాడు చాల మందికి కనపడటంలేదు. కాని తన సంగీతం ద్వారా అందరి హృదయాల చేరువకు రాగలిగాడు ఒక్క క్షణంలో. అతని సంగీతం ఒక్కొక్కరిలో ఒక్కొక్క భావాన్ని రేకెత్తిస్తోంది.

శాంత మధూలు కూడా ఆ పెట్టెలోనే ప్రయాణం చేస్తున్నారు. శాంత బిచ్చగాని సంగీతం వలన ఆమె జీవితంలోని చిన్నతనపు రోజుల లోనికి తీసుకొని పోబడింది. ఆమె అయిదవ ఫారం చదువుతూండగా ఆతరగతిలో సంగీతం మధురంగా పాడగల ఒక కుర్రవాని యందు ఆమె మనసు లగ్నమై వుండేది. ఆ ఆ కుర్రవాడికి సంగీతం దైవ ప్రసాదితం. సంగీతమంటే చెవికోసుకునే గుణం శాంతకు దైవ ప్రసాదితం. శాంతకు సంగీతం మీద కల అభిరుచి ఆ నిరుపేద కుర్రవాని యెడ అభిమానాన్ని కల్పించింది. అభిమానం క్రమేపీ స్నేహితంగా మారింది. స్నేహితం కొద్దిరోజుల్లో నే గాఢమైన ప్రేమగా మారిపోయింది. శాంత లేత మనస్సు అనేక సార్లు సంతృప్తి చెందింది అతని సంగీతంవల్ల. మరుసటి సంవత్సరం స్కూలు ఫైనలు తరగతిలోకి శాంత వచ్చేసరికి అతను కన్పించక పోవడం ఆశ్చర్యాన్ని కల్గించింది. ఆ కుర్రవాడూ శాంతతో పాటు అయిదవ ఫారం ఉత్తీర్ణుడయ్యాడు. శాంత హృదయంలో మారుమూలలో అతనికొక స్థానం ఏర్పడి శ్రావ్య సంగీతం విన్నప్పుడల్లా శాంతకి చిన్ననాటి స్నేహితుని జ్ఞాపకం చేస్తూ వస్తోంది.

"ఎవరికోసం ఈ బ్రతుకు" అంటూ మరో పాట మొదలెట్టాడు బిచ్చగాడు. ఆ పాట తానొక నిరాశా జీవిననే విషయాన్ని శ్రోతలకు స్పష్టంగా తెలియజేస్తోంది. నిజంగా ఒక బిచ్చగాడు ఆశాజీవి ఎట్లా కాగలడు? ప్రయాణీకుల్లో ఒకడు "ఏయ్ ఆ పాట మళ్ళీపాడు" అన్నాడు. మిగతా ప్రయాణీకులంతా ఒకసారి అతని ముఖంలోకి చూశారు, ఆ ప్రయాణీకుడు చిన్నపోయాడు. నిజానికి అతనే కాదు ఇంకా చాలమంది నిరాశా జీవులు ఆ పెట్టెలోనే ప్రయాణం చేస్తూ ఉండి ఉంటారు. కాని అతని హృదయంలో గల బాధను బహుశ్రావ్య కంఠంలో వ్యక్తంచేయగలిగాడు ఒకబిచ్చగాడు. ఆ పాట అతన్ని మైమరపించింది. తన కోరికను వెళ్ళబుచ్చాడు. అంతే. మిగతా వాళ్లు సాంఘిక మర్యాద కాదనుకొని నోరు మెదల్ప లేదు. పైగా అంతా ఆశాజీవులే అనేవిధంగా అతనివైపు ఒకేసారి చూశారు. బిచ్చగాడు ఆ ప్రయాణీకుని కోరికను మన్నించాడు. పాటపాడుకుంటూ సందు చేసుకుని ముందుకు వస్తున్నాడు.

"మరచితివా నన్ను ఓ ప్రియ మాధురీ" అని మళ్లీ ఇంకో ప్రేమగీతం ఎత్తుకున్నాడు. బిచ్చగాడు పెట్టెలోని వాళ్ళందరికీ కనపడక పోయినా అతడికిమాత్రం చాలామంది కన్పడుతున్నారు. కొంతమంది బిచ్చగాడి ముఖం చూద్దామనే కోరికకొద్దీ నిలుచుని ప్రయత్నిస్తున్నారు. ప్రేమ గీతం పాడుతూ బిచ్చగాడు ఒక ముప్పది ఏండ్ల యువకుని వద్ద నిలబడి ఉండటం యువకుని భార్యకు కష్టం వేసింది. భార్య కష్టాన్ని గ్రహించిన యువకుడు "ఏయ్ ఆపవోయ్ నీపాట నువ్వూనూ" అనితన చేతులో ఉన్న పుస్తకంలోకి తీక్షణంగా చూడసాగాడు. "మీకేం నష్టం వచ్చిందండీ" అంటూ చాలామంది ఒక్కసారి విరుచుకు పడ్డారు అతని మీద. "వీడెవడో బొరంగజేబు లాగున్నాడురా" అన్నాడొక కాలేజీ విద్యార్థి కీచుగొంతుకతో. "నీకేం పరవాలేదు పాడు నేనున్నాగా" అంటూ లాల్చీ పైకి లాగుతూ అన్నాడు ఒక బలిష్టమయిన యువకుడు. "పాడినందుకు కాదండీ, వీడికి ఎంత గర్వం అనుకున్నారు, ఎప్పుడూ ఈ రైల్లోనే ప్రయాణం చేస్తూంటాడు. ఇంకో పాట పాడమంటే కొట్టొచ్చినట్లు మాట్లాడేవాడు రోజూ. ఈ రోజు ఎందుకో కదలకండా పాటమీద పాట పాడుతున్నాడు." అని తనకు దగ్గరగా నున్న ప్రయాణీకులతో వెళ్ళబోసుకున్నాడు. కాని బిచ్చగాని కంఠ మాధుర్యం ముందు అతని సమాధానం అంతగా ఎవరినీ ఆకర్షించలేదు.

కొంచెం సేపటికి బిచ్చగాడి ముఖం అందరికి కనిపించింది. యువకుడే అయినా సంస్కారము లేని జుట్టూ గెడ్డంవల్ల ముసలివాడిలాగా కన్పిస్తున్నాడు. చాలాకాలం తరువాత శాంత తన చిన్ననాటి స్నేహితుని కంఠాన్ని పోలిన స్వరం వింది. కాని ముఖంలో మాత్రం స్నేహితుడని తెలియజేసే పోలికలు యెక్కడా కన్పించలేదు శాంతకు. పైగా తన స్నేహితుడు ఎంత నిరుపేదయైనా బిచ్చమెత్తుకునే స్థితికి దిగజారుతాడనే అనమానము కలగలేదు.

బిచ్చగాడు డబ్బు అడుక్కుంటూంటే ప్రతి ప్రయాణీకుడు కానో అర్ధణో ముట్ట చెప్పుతూనే వున్నాడు. పాట పాడవద్దన్న వ్యక్తిదగ్గరకు వచ్చినపుడు బిచ్చగాడు "ఏంబాబూ యెందుకంత నిర్దయ. ప్రపంచంలో అనాధులుగా బ్రతుకుతూన్న మామీద కేనా మీకంత కోపం?" అన్నాడు. ప్రయాణీకుడు "వెళ్ళిపో" అందా మనుకున్నాడు కాని మళ్ళీ పదిమందిలో నగుబాటు అవుతుందేమోనని ఒక అర్ధణా కాసు యిచ్చాడు. బిచ్చగాడు "మళ్ళీ పాడమన్న" వ్యక్తి దగ్గరకువచ్చాడు. అతడు అర్ధరూపాయి యిచ్చాడు. బిచ్చగాడు చిల్లర ఇవ్వబోయాడు. "వద్దు. ఉంచుకో," అన్నాడావ్యక్తి. అపరిచిత వ్యక్తికి తనమీద కలిగినదయకు బిచ్చగాడు చాలా సంతోషించి అతనిపాదాలు స్పృశించాడు కృతజ్ఞతాపూర్వకంగా. ఆనందోత్సాహంతో అతడి నేత్రాలు పెద్దవయినాయి.

"ఏవూరు మీది?" అని ఆ వ్యక్తి ప్రశ్నించాడు.

"ఏలూరు బాబూ."

"నీకు భార్యా పిల్లలు లేరా?"

"లేరు. తల్లీ తండ్రీకూడా లేరు. ఇల్లూవాకిలీ లేదు. దేముడిచ్చిన కంఠంతో సంపాయించుకుని పొట్ట పోషించుకుంటున్నాను."

ప్రక్కనేఉన్న యువకుడొకడు "నువ్వు సినిమాల్లోకి వెళ్లావా బోలెడంత సంపాయించవచ్చు" అన్నాడు.

"ఎందుకు డబ్బు నాకు. ఎవరికోసం సంపాయించడం? చూస్తూ చూస్తూండగనే ఎప్పుడో ఒరిగిపోతాను" అన్నాడు బిచ్చగాడు.

శాంత బిచ్చగాడిని తదేకధ్యానంతో చూడసాగింది. తన స్నేహితుడిగా పోల్చుకోటానికి కంఠంతప్ప వేరే ఆధారాలు లేవు. అతడి జీవిత విశేషాలను పూర్తిగా తెలుసుకోవలెనని కుతూహలం ఉన్నా సంఘ మర్యాద కాదనుకొని మానుకుంది. భర్తముంగు ఇల్లాంటి ప్రవర్తన అనుమానానికికూడా దారి తియ్యవచ్చు. తనలాంటి ధనిక కుటుంబంలో పుట్టిపెరుగుతూన్న స్త్రీకి బిచ్చగానితో స్నేహితం ఏమిటని సంఘం విస్తుపోతుంది. ఎవరి అంతస్థులో వాళ్ళే నివసించాలి, పై అంతస్థులో నివసించే వ్యక్తికి క్రింద అంతస్థులో నివసించే వ్యక్తితో పొత్తేమిటి? కాని తన జీవితంలో మధురస్వప్నాలు కలుగజేసిన వ్యక్తి అభివృద్ధికి తోడ్పడే అవకా

శమే తనకు లేదా అని ఆలోచించడం మొదలు పెట్టింది శాంత.

బిచ్చగాడు యెందుకనో తొందరగా కదల కుండా కబుర్లు చెప్తూ ఉండటం కొంతమందికి ఆశ్చర్యం వేసింది. శాంత వాళ్లు కూర్చున్న వైపుకు వెళ్లడానికి సందేహిస్తున్నట్లుగా అతని ముఖంలో కన్పిస్తోంది. బహుశా ఆ ప్రక్కంతా ఎక్కువ మంది ఉద్యోగస్థులు కూర్చుని ఉండటంవల్ల అయి ఉండొచ్చని కొంతమందికి తట్టింది. బిచ్చ గాళ్లు నిర్భయంగా జనాన్ని తోసుకుంటూ కూడా రైళ్లల్లో ఎక్కి చకచకా డబ్బు అడుక్కుపోవడం అందరికీ తెలిసిన విషయమే. ఇతని భిన్న ప్రవర్తన ఎవరికీ అర్థం కావడంలేదు.

బరువుగా అడుగులు వేసుకుంటూ ముందుకు నడువసాగాడు బిచ్చగాడు. సంశయిస్తున్నట్లు అతడి మాటలుకూడా బుజావుపరుస్తున్నాయి. మధుని సమీపించబోతున్న బిచ్చగాడు "చిన్న నాటి వలపులు, తలపులూ" అనటం యెత్తు కున్నాడు. కంఠంలోంచి గానం స్వేచ్ఛగా రావడంలేదు. శాంత ఈ పాటతోటి అతడే తన మిత్రుడని నిర్ధారణ చేసుకుంది. ఎందుకంటే చిన్ననాడు చదువుకునే రోజుల్లో సరిగ్గా ఇదే పాటను అతడు ఎన్నోవందలసార్లు పాడించు కుంది అతనిచేత, ఒక్కమాటకుకూడా ఆనాడు అర్థం తెలియకపోయినా. మధు చదువుతున్న ఇంగ్లీషు పేపరు మొఖాన కడ్డంలేకుండా తీసి కళ్లద్దాలు సవరించుకుంటూ "బిచ్చగాళ్ల సమస్య మన దేశంలో ఎక్కువయిందండీ" అని తన ప్రక్కనే ప్రయాణంచేస్తున్న మరో ఉన్నతో ద్యోగితో అన్నాడు. "ఎక్కువ ఆపటమే కాదు వీళ్ళే రైలు ఆగినప్పుడు జేబుదొంగలుగా తయారవుతారు. బిచ్చగాళ్లలా పెట్టెల్లో ఎక్క డం ప్రయాణీకులను పరిశీలించడం దిగబోయే టప్పుడు జేబుల్లోవి కొట్టేయడం" అన్నాడా రెండో ఉద్యోగి.

బిచ్చగాడది విన్నాడు. మరో రోజున అయితే తగిన సమాధానం చెప్పే వాడు. అందులో పెట్టెలోని అధిక సంఖ్యా కులు ఆ మాదిరిగా తనను ఆదరించినపుడు. కాని ఆ రోజున ఒక చిన్న కుర్రవాడి బెదరిం పులనుకూడా ఎదుర్కొనే స్థితిలో లేడు. తన విధి ప్రకారం వాళ్ళనికూడా సహాయం అర్థిద్దా మనుకున్నాడు. కాని మనస్సు ఏమాత్రం ఒప్పుకోలేదు. అడక్కుండా వెళ్లిపోతే "వీడి కెంత గర్వంరా" అంటారేమో! అడిగినా ఎట్లాగ ఈసడించుకుంటారేగాని యివ్వరని తెలుసు. సంఘంలో గౌరవ స్థానాన్ని పొందిన వారిని తృణీకరించడం సాంఘిక మర్యాద కాదనుకుని వాళ్ళవైపు చేతులు చాచాడు. మధు "పో. అవతలకు" అన్నాడు కాని శాంత మాత్రం ఓ బిస్కెత్తుల పొట్లాం యిచ్చింది. చాలా ఆప్యాయంగా పుచ్చుకున్నాడు బిచ్చ గాడు. ఇంతవరకు ఏదో సంశయాత్మకం గాను అనుమానాస్పందంగాను నడుస్తున్న బిచ్చగానిలో శాంత యిచ్చిన బిస్కెత్తుల పొట్లం ఉద్వేగాన్ని కలుగచేసింది. ఆ సంతో షంలో అతడు ఒకళ్ళిద్దరిని డబ్బులు అడగటం కూడా మానేశాడు. మోకాళ్ళమీద చేతులు పెట్టుకుని తన మూటమీద కూర్చుని ఉన్న ఓ నిరుపేద ముసలి జీవి ప్రక్కవాడితో "పాపం ఎన్ని రోజులయిందో అన్నం తిని!" అని ఆశ్చర్యాన్ని తెలియచేశాడు.

బిచ్చగాడు తన జీవిత చరిత్రలో ఆ రోజున ఒక విచిత్రమైన మానసిక అనుభూతిని పొం దాడు. ఆ అనుభూతే చాలా కాలం వరకు బిచ్చగాడిలో మానసిక ఆనందాన్ని కలుగ చేసింది.

విజయవాడ స్టేషను వచ్చింది. మధు శాంత దిగారు. మధు ఆ పట్టణంలో ఒక ఉన్నతో ద్యోగి అవడంవల్ల స్టేషనువద్దకు ఒక గుమాస్తా ఒక జవాను వచ్చారు. సామాను జవాను కప్ప గించి శాంత మధులు తమకోసం వేచి ఉన్న కారులో యింటికి చేరారు.

వారం రోజులు గడిచాయి. శాంత ప్రక్కవాళ్ళింట్లో ఏదో పేరంటం వచ్చింది. శాంత ముస్తాబయి నాలుగేళ్ళ కూతురయిన హేమకు కూడా ముస్తాబు చేసింది. శాంత పేరంటానికి వెళ్దాం అనుకుంటూండగానే మధు ఇంటికివచ్చాడు. వచ్చీ రావడంతోంటే హేమ "అమ్మ గొలుసివ్వనంటోంది నాన్నగారూ" అంటూ తల్లిమీద నేరం చెప్పింది. ఆనాడు చికాకుగా ఆఫీసునుండి రావడంవల్ల మధు

"శాంతా ఎందుకే దాన్ని అట్లా ఏడ్పించడం? ఎంతవరకు నీ ముస్తాబే కాని దాని సంగతి అక్కర్లేదా ఏమిటి?" అని గట్టిగా అరిచాడు. మధు మానసిక స్థితిని గ్రహించిన శాంత హేమను దగ్గరకు పిలిచి బుజ్జగించ ప్రయత్నించింది. తన గొలుసు యిస్తానంది. హేమ ఊహుఁ అంటే ఊహు అంది. "నీ గొలుసు ఎక్కడో పోయింది?" అంది శాంత. "ఆ పోలేదు, దాచావు" అంటూ మళ్ళీ తండ్రి దగ్గరకు బయలుదేరింది హేమ. శాంత హేమని పట్టుకోబోయింది. కాని తుర్రుమని పారిపోయింది.

"ఏమయింది దాని గొలుసు?" అనుకుంటూ మధు ప్రవేశించి కఠినంగా ప్రశ్నించాడు. "ఎక్కడో పోయింది. కనపడలా" అంది శాంత నెమ్మదిగా. "ఎక్కడో పోతే నోరు మూసుకుని కూర్చున్నావెందుకు?" అన్నాడు. "ఏం చేయమంటారు నిర్ధారణగా ఎవరు తీశారో తెలియందే?" అంది శాంత. "అమ్మమ్మగారింటినుండి వచ్చేటప్పుడు రైల్లో నా గొలుసు తీసుకుంది నాన్నా" అంది హేమ. "నిజమేనే?" అని ప్రశ్నించాడు మధు. "నిజమే. స్టేషను వచ్చే ముందు జేబు దొంగ లుంటారని తీసి జాగ్రత్త చేశా. నాలుగు రోజులునుండే కనపడటంలా" అంది శాంత. "ఆ పని పాటల వాళ్ళే తీసి ఉంటారు. ఈ ముండల్ని పోలీసులకు అప్పగించాలి" అన్నాడు మధు.

మధు తన యింట్లో జరిగిన దొంగతనాన్ని గురించి పోలీసులకు రిపోర్టు చేశాడు. ఉన్నత అధికారి అవడంవల్ల పోలీసులు కూడా కూపీ తియ్యడంలో బహు శ్రద్ధ వహించారు. మధుకు ఒక చిన్న గొలుసు పోయినందువల్ల ఏ మంత విచారం లేదు. కాని తన ఇంట్లో ఒక పూచిక పుల్లమాత్రం ఎందుకు దొంగలింపబడాలనే పట్టుదలే అతన్ని కార్యోన్ముఖుణ్ణి చేసింది.

వారం రోజుల్లో పోలీసులు దొంగని పట్టుకోగలిగారు. వస్తువును దొంగ ఏమాత్రం చెడగొట్టకుండా మెడలో వేసుకుని తిరుగుతున్నాడన్న విషయాన్ని పోలీసులు లాగగలిగారు. మరునాడు దొంగని కోర్టులో హాజరుపరుస్తారనీ వస్తువుని తీసుకోటానికి కోర్టుకు రావలసిందనీ మధుకు కబురుచేశారు.

మరునాడు మధు కోర్టుకు హాజరయ్యాడు. దొంగని మేజస్ట్రేటు ముందర పోలీసులు హాజరుపరచారు. ఆశ్చర్యం! ఆ దొంగ పదిహేను రోజుల క్రిందట మధు ప్రయాణం చేస్తున్న పెట్టెలో కనిపించిన బిచ్చగాడే! "హారి వీడి దుంపతెగా! నిజంగా ఆయనెవరో చెప్పినట్లు బిచ్చగాళ్ళే జేబు దొంగలుగా మారిపోతున్నారన్న మాట. వీడి పోకడలనుబట్టి అప్పుడే అనుకున్నాను దొంగని!" అని మధు తనలో తాను అనుకున్నాడు. న్యాయాధికారి దొంగని "వస్తువు నువ్వేనా దొంగిలించింది?" అని ప్రశ్నించాడు. "అవును నేనే. వారి భార్య ఆ వస్తువును ప్రక్కన పెట్టే కొట్టేశాను" అని దొంగ సమాధానం ఇచ్చాడు. న్యాయాధికారి వస్తువుని మధుకి ఇప్పించాడు. దొంగకి మూడు నెలల కఠిన శిక్ష విధించాడు.

మధు ఇంటికి వచ్చి పెద్ద ఆశ్చర్యాన్ని వెలిబుచ్చుతూ "చూశావా శాంతా ఎంతపని జరిగిందో అనుకున్నట్టుగానే ఆనాటి రైల్లోని బిచ్చగాడే మన వస్తువును కాజేసిన దొంగ. క్షణంసేపు మన దగ్గిర నుంచున్నట్లు నుంచుని కొట్టేశాడు. వాడికి మూడు నెలలు కఠిన శిక్ష విధించాడు మేజస్ట్రేటు" అన్నాడు. గొలుసు హేమ మెళ్ళోకి వెంటనే వెళ్ళిపోయింది.

శాంత ముఖంలో ఆశ్చర్యం ఏమీలేదు సరికదా విచారసూచనలు పొడగట్టాయి. మధుకు ఆశ్చర్యం వేసింది. కాని మధుకి వెంటనే శాంత మానసికవ్యథకి కారణం కన్పించింది. శాంత సంగీతం అంటే చెవి కోసుకుంటుంది. ఏ గాయకుడిని చూసినా శాంతకు విపరీతమయిన అభిమానం. ప్రస్తుత గాయకుడికి కల్గిన నష్టానికి శాంత విచారపడుతుండవచ్చు అని సమాధానం చెప్పుకుని ఊరుకున్నాడు.

శాంత తెప్పరిల్లింది. ధైర్యంగా మెల్లిమెల్లిగా ఆమెను వశపరచుకుంది. బిస్కట్ల పొట్లాంలో గొలుసునుపెట్టి ఆమె స్వయంగా ఇచ్చిన సంగతి చెప్పాడామనుకుంది. కాని ఏంలాభం మళ్ళీ మధు మనస్సులో మరో తుపాను లేవగొట్టడం తప్ప? బిచ్చగాని కృతజ్ఞతకు శాంత లోలోపల దుఃఖంతో కృశించిపోయింది.